క్లుప్తంగా

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచర పాలెం దరి దుర్గానగర్‌లోని దుర్గమాంబ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు. ప్రత్యేక దర్శనాల్లో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కురిసింది వాన



ముద్దయిన పారిశ్రామిక ప్రాంత సేవా మార్గం

మల్కాపురం: ఉక్కపోత, తీవ్ర ఎండతో అల్లాడిన పారిశ్రామిక వాసులు మంగళవారం ఉదయం కురిసిన వర్షానికి కాస్తా సేద తీరారు. భానుడి ఉగ్రరూపానికి వారం రోజులుగా జనం విలవిల్లాడారు. ఒక వైపు ఉక్కపోత,మరో వైపు ఎండ దాటికి తట్టుకోలేక చాలా మంది ఇంటికే పరిమితం అయ్యేవారు. మంగళవారం కురిసిన వర్షానికి హమ్మయ్యా అంటు ఊపిరి పీల్చుకున్నారు. జోరువానకు సేవా మార్గాల్లో నీరు చేరింది.

త్వరలో ప్రీ పెయిడ్ ట్యాక్సీ సేవలు



సింహాచలం రైల్వే స్టేషన్‌లో తయారవుతున్న ప్రీపెయిడ్ ట్యాక్సీ కౌంటర్

గోపాలపట్నం: గోపాలపట్నం స్టేషన్‌కు వచ్చే రైలు ప్రయాణికులకు త్వరలో ప్రీపెయిడ్ ట్యాక్సీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇటీవల స్థల పరిశీలన చేసిన అధికారులు ఇక్కడ కౌంటర్ నిర్మిస్తున్నారు. రైలు దిగే ప్రయాణికులు ఇక్కడే కార్లను బుక్ చేసుకుని భద్రంగా తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు అవకాశం కలుగనుంది. ఇప్పటి వరకు సింహాచలం నుంచి పలు ప్రాంతాలకు ప్రైవేటుగా బుక్ చేసుకుని వెళ్లేవారు. ఇప్పుడు ట్యాక్సీ కూడా అందుబాటులోకి రానుంది. ఇది పోలీసుల పర్యవేక్షణ నిర్వహించనున్నారు. దీని వల్ల భద్రతగా ఉంటుందని ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా గాజువాక, సింహాచలం వెళ్లే వారికి ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1 వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం గిరి ప్రదక్షిణ వైభవంగా జరిగింది. పౌర్ణమి సందర్భంగా సాయంత్రం ఆరు గంటలకు ఏర్పాటు చేసిన గిరి ప్రదక్షిణ ఆద్యంతం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, మనోజ్ స్వామి, హరినారాయణ స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు వేకువజామున వేంకటేశ్వరస్వామికు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. స్వామి పచ్చ కర్పూరంతో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

తాగునీటి కష్టాలు తప్పేవా?

నగర వాసులకు సకాలంలో పరిశుభ్రమైన తాగునీరు సరఫరా వెనుక వాటర్ సప్‌లై కార్మికుల శ్రమ ఎంతో ఉంది. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు వారంతా నిద్రలేకుండా పనిచేస్తేనే ప్రతీ ఇంటికీ తాగునీరు వచ్చేది. ప్రజారోగ్య పరిరక్షణలో తమ వంతు పాత్ర పోషిస్తోన్న వాటర్ సప్‌లై కార్మికుల విషయంలో ప్రస్తుత జీవీఎంసీ పాలకులు వ్యవహరిస్తున్న విధానాలు వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. దీంతో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రోడ్డెక్కేందుకు సిద్ధమయ్యారు.

- వాటర్ సప్లై కార్మికుల టూల్ డౌన్
- వేతనాల పెంపుపై జీవీఎంసీలో నాటకీయ పరిణామాలు
- కౌన్సిల్ ఆమోదించినా, అమలుకు నోచుకోని వైనం
- చాలీచాలని వేతనాలతో కార్మికుల ఇబ్బందులు
- న్యాయమైన కోర్కెల సాధనకు ఆందోళనకు సిద్ధం



పైపులైన్ల మరమ్మతులు చేస్తున్న కార్మికులు(ఫైల్)



బుచ్చిరాజుపాలెంలోని రిజర్వాయరు

విశాఖ విద్య: వాటర్ సప్లై కార్మికుల సమస్యలను జీవీఎసీ పాలక పెద్దలు, అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో వారంతా 'టూల్ డౌన్'(విధుల్లో ఉంటూనే సహాయ నిరాకరణ)కు రెడీ అవుతున్నారు. బుధవారం అర్ధరాత్రి 12.01గంటల నుంచి పని బంద్ చేసి నిరసన తెలుపుతామని కాంట్రాక్ట్ వర్కర్స్, లేబర్ యూనియన్ ప్రతినిధులంతా మంగళవారం జీవీఎంసీ అధికారులకు లేఖ అందజేశారు. ఇదే జరిగితే, ఈ నెల 12 అనగా గురువారం నుంచి తాగునీటి సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. ఈ విషయం తెలిసిన ప్రజానీకంలో అప్పుడే కలవరం మొదలైంది. తాగునీరు సరఫరా కాకుంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందేనని శివారు కాలనీల వాసులు ఆందోళన చెందుతున్నారు.

టూల్ డౌన్ ఎందుకంటే

నగర పాలక సంస్థ వాటర్ సప్‌లై విభాగంలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచుతూ గత డిసెంబర్‌లో కౌన్సిల్ తీర్మానం చేసింది. అన్ స్కిల్డ్ కార్మికులకు ప్రస్తుతం ఇచ్చే రూ.15 వేల నుంచి రూ.18,500లకు పెంచాలని, అదే విధంగా స్కిల్డ్ కార్మికులకు(టెక్నికల్ విద్యార్హతలు కలిగిన వారు) రూ.18,500 నుంచి రూ.21,500కు పెంచాలని నిర్ణయించారు. ఉత్తర, ప్రత్యుత్తరాల అనంతరం కౌన్సిల్ ఆమోదం మేరకు మే నెలలో వేతనాల పెంపునకు ఆయా విభాగాధికారులు బిల్లులు సిద్ధం చేశారు. కానీ ఇంతలోనే ఏం జరిగిందో వారికి వేతనాలు పెంపు కుదరదని, పెట్టిన బిల్లులు సైతం వెనక్కి తీసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న వాటర్ సప్‌లై కార్మికులు అధికారులను కలసినా వారి నుంచి సమాధానం రాకపోవడంతో టూల్ డౌన్‌కు సిద్ధమయ్యారు.



మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో గల ఓవర్‌హెడ్‌ట్యాంక్

శివారు కాలనీలపై తీవ్ర ప్రభావం

90వ వార్డు బుచ్చిరాజుపాలెం ఏపీఎస్ఇబీ కాలనీ(బ్లాక్–24)లో ఉన్న రిజర్వాయరు ఎన్ఏడీ సమీపంలోని ఆరు వార్డుల ప్రజానీకం తాగునీటి అవసరాలను తీరుస్తోంది. తాగునీటి కొరత అనేది లేకుండా రైవాడ, తాటిపూటి, గోస్తనీ రిజర్వాయరుల నుంచి నీటిని పైపులైన్ల ద్వారా తీసుకొచ్చి, ఇక్కడ నిల్వ చేస్తున్నారు. 1080 కిలో లీటర్ల సామర్థ్యం గల రిజర్వాయరు (ఒక కిలో లీటరు అంటే లక్ష లీటర్లు) అందుబాటులో ఉంది. ఇక్కడ నుంచి ఎగువ ప్రాంతంలో ఉన్న బ్లాక్–23 రిజర్వాయరుకు 700 కిలోలీటర్లు, ఇందిరానగర్‌లో వెయ్యి కిలోలీటర్లు, లక్ష్మీనగర్–ఎఫ్ వద్ద 50 కిలో లీటర్లు, ఇ బ్లాక్ వద్ద 16 కిలో లీటర్లు, సీడీ బ్లాక్ వద్ద 160 కిలోలీటర్లు, రామకృష్ణ నగర్ వద్ద 200 కిలోలీటర్లు పంపుహౌస్ ద్వారా ట్యాంకుల్లో నిల్వ చేసి, పరిసర కాలనీలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. బుచ్చిరాజుపాలెం రిజర్వాయరు పరిధిలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు 29 మంది సిబ్బంది రేయింబవళ్లు పనిచేస్తున్నారు. కార్మికులు అంతా సేవలు బంద్ చేస్తే తాగునీటి సరఫరా నిలిచిపోనుంది. ఈ ప్రభావం శివారు కాలనీలపై ఎక్కువగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఫ్యాక్టరీ సవరణ బిల్లుతో కార్మికవర్గానికి నష్టం



సమావేశంలో పాల్గొన్న బీఎంఎస్ నాయకులు

గాజువాక: రాష్ట్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరించడానికే ఏపీ ఫ్యాక్టరీల సవరణ బిల్లు 2025ను తీసుకొస్తోందని బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.జగదీశ్వరరావు ఆరోపించారు. గాజువాకలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సవరణ బిల్లు వల్ల కార్మికుల రోజువారీ పని గంటలను తొమ్మిది నుంచి పది గంటలకు పెంచుతారని, విశ్రాంతి విరామానికి ముందు పని సమయాన్ని ఐదు నుంచి ఆరు గంటలకు పెంచుతారన్నారు. విశ్రాంతితో సహా రోజువారీ పని గంటలను పదిన్నర గంటల నుంచి 12 గంటలకు పెంచుతారని, ప్రతి మూడు నెలల్లో ఓవర్ టైమ్ (ఓటీ) పరిమితిని 50 గంటల నుంచి 144 గంటలకు పెంచుతారని, మహిళా కార్మికులు సేఫ్ గార్డులతో రాత్రి షిఫ్టులలో పని చేయడానికి అనుమతిస్తారని పేర్కొన్నారు. వ్యాపారం చేయడంలో సౌలభ్యం కోసం, రాష్ట్రంలో వ్యాపారం చేయడానికి మెరుగైన వ్యాపార వాతావరణాన్ని సృష్టించడానికి పెట్టుబడిదారులను ఆకర్షించడానికి ఈ మార్పులు చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొనడం దారుణమన్నారు. దీనివల్ల ఉద్యోగుల శ్రేయస్సు, ఆరోగ్యం, కుటుంబ వ్యవస్థలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతాయన్నారు. ఉద్యోగుల భవిష్యత్‌పై కూడా దుష్ప్రభావం చూపుతాయన్నారు. ఉద్యోగుల సంక్షేమంలో ఫ్యాక్టరీల చట్టం 2025లో చేసిన మార్పులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు అనుమతించిన నెట్‌వర్కింగ్ సూత్రాలను తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఓటీ పెంపు కొత్త ఉపాధి అవసరాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని, భవిష్యత్‌తరం ఉద్యోగ అవకాశాలకు అతిపెద్ద అడ్డంకిగా ఉంటుందని అన్నారు. సమావేశంలో బీఎంఎస్ నాయకులు ఎం.వి.ఎస్.నాయుడు, కె.లోవరెడ్డి, లాలం ప్రసాద్, రొక్కం సురేష్ కుమార్, ఒ.హనుమంతరావు పాల్గొన్నారు.

ఉద్యోగులు అనే పదాన్ని తొలగిస్తేనే సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న గొలగాని అప్పారావు

అగనంపూడి: జీవీఎంసీలో ఇంజనీరింగ్, పారిశుధ్యం, నీటి సరఫరా విభాగాల్లో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులను ఆప్కాస్ ఉద్యోగుల జాబితా నుంచి తొలగిస్తే తప్పా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు అర్హులు కారని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు అన్నారు. 85వ వార్డు కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవీఎంసీలో వివిధ విభాగాల్లో కాంట్రాక్ట్ కార్మికులకు పెరిగిన జీతాలు కాకుండా పాత జీతాలు ఆయా సెక్షన్ల పరిధిలో ఉండడం వల్ల ఈనెల జీతాల చెల్లింపులో జాప్యం జరుగుతుందన్నారు. అలాగే ఈనెల 19న నిర్వహించనున్న యూనియన్ గాజువాక జోన్ మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో సుమారు రూ. 35 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మజ్జి మాలినాయుడు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఎన్టీఆర్‌కాలనీలోని బ్లాక్ నెంబర్ 10 వద్ద సుమారు రూ.19 లక్షల వ్యయంతో రిటైనింగ్ వాల్స్, ప్రకాష్‌నగర్‌లో రూ.16 లక్షల వ్యయంతో డ్రైన్లు, రోడ్స్ వంటి పనులు చేపట్టనున్నట్టు తెలిపారు.

ఎస్‌హెచ్‌జీ సభ్యులు యోగాంధ్రలో పాల్గొనాలి

మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్



డాబాగార్డెన్స్: విశాఖ వేదికగా ఈ నెల 21న నిర్వహించనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాల్లో ఎస్‌హెచ్‌జీ సభ్యులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్ పిలుపునిచ్చారు. గురజాడ కళాక్షేత్రంలో మంగళవారం జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పీఎం సత్యవేణి నేతృత్వంలో ఎస్‌హెచ్‌జీ సభ్యులు, ఎస్ఎల్ఎఫ్ రిసోర్స్ పర్సన్స్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, సోషల్ వర్కర్లు, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్లు, ఇతర జిల్లా స్పెషల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కల్యాణ్, ఇతర ప్రజా ప్రతినిధులు, విశాఖ ప్రజలందరితో చేపట్టనున్న కార్యక్రమం విశాఖ చరిత్రలో నిలిచిపోనుందన్నారు. మానసిక, శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు మన పూర్వీకుల నుంచి వారసత్వంగా వస్తున్న యోగా ప్రక్రియ ప్రపంచానికి పరిచయం చేసి 10 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖలో నిర్వహించడం గర్వకారణమన్నారు. ఒకే చోట 5 లక్షల మంది ప్రజలు కూర్చుని యోగా నిర్వహించి గిన్నిస్, ప్రపంచ రికార్డు నెలకొల్పి ప్రపంచానికి మన రాష్ట్ర శక్తి, విశాఖ కీర్తిని చాటాలని పిలుపునిచ్చారు. జీవీఎంసీ సిబ్బంది, మెప్మా, స్పెషల్ ఆఫీసర్లు, ఎస్ఎల్ఎఫ్ ఆర్పీలు, సంఘ నాయకులు చక్కటి సమన్వయంతో ప్రజలందరినీ వేదిక వద్దకు సమీకరించి, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

సీఐఎస్ఎఫ్ సిబ్బంది జీతాల నిర్వహణపై ఎస్‌బీఐతో ఒప్పందం

ఉక్కునగరం: కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) సిబ్బంది జీతాల ఖాతాలను నిర్వహించేందుకు సీఐఎస్ఎఫ్‌తో ఎస్‌బీఐ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సీఐఎస్ఎఫ్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, పదవీ విరమణ పొందిన సిబ్బంది ఖాతాలను మూడేళ్ల పాటు నిర్వహించేలా ఒప్పందం జరిగింది. ఈ మేరకు సీఐఎస్ఎఫ్ తరపున అడ్మినిస్ట్రేషన్ డీఐజీ రేఖ నంబియార్, ఎస్‌బీఐ కార్పొరేట్ సెంటర్ జీఎం రంజన్ సిన్హాలు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ అవగాహన ఒప్పందం ప్రకారం సిబ్బందికి మెరుగైన ఆర్థిక ప్రయోజనాలను సమకూర్చడంతో పాటు సీఐఎస్ఎఫ్ సిబ్బంది కుటుంబ సభ్యుల సంక్షేమం, ఆర్థిక భద్రతకు దోహదపడతాయని స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ యూనిట్ వర్గాలు తెలిపారు. ఒప్పందం నియమాల ప్రకారం జీరో అక్కౌంట్ ఇవ్వడంతో పాటు రూ. 50 లక్షలు ప్రమాద బీమా (మరణ) కవరేజి ఉంటుంది. వార్షిక నిర్వహణ చార్జీలు లేకుండా ఉచిత డెబిట్ కార్డు, ఎస్‌బీఐ ఏటీఎంలలో అపరిమిత ఉచిత లావాదేవీలు, ఇతర బ్యాంక్ ఏటీఎంలలో నెలకు 10 ఉచిత లావాదేవీలు, హర్షక లాకర్‌పై 10 శాతం రాయితీ ఉంటాయి. ఉచిత డిమాండ్ డ్రాఫ్ట్‌ల జారీ ఉంటుంది. ఈ ఒప్పందం ద్వారా జవాన్లకు ఎస్‌బీఐ రిష్టే కుటుంబ పొదుపు ఖాతాను పరిచయం చేశారు. తద్వారా సిబ్బంది భాగస్వామి, పిల్లలు, తల్లిదండ్రులు, తోబుట్టువులు నాలుగు జీరో ఖాతాలు తెరవడానికి అవకాశం కల్పించారు. ఈ ప్రయోజనాలపై సీఐఎస్ఎఫ్ సిబ్బందికి అవగాహన కల్పించేందుకు ఎస్‌బీఐ సిబ్బంది ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

పరిశ్రమల రాయితీలు హోటల్ రంగానికీ అందించాలి

మంత్రి టీజీ భరత్‌కు వివిధ సంస్థల ప్రతినిధుల వినతి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న పైడా కృష్ణ ప్రసాద్, కంకటాల మల్లిక్, కార్తీక్ తదితరులు

ఏయూక్యాంపస్: ప్రభుత్వ పరంగా పరిశ్రమలకు కల్పించే రాయితీలను హోటల్ రంగానికి సైతం కల్పించాలని కోరుతూ రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి టి.జి.భరత్‌కు వివిధ సంస్థల ప్రతినిధులు వినతిపత్రం అందించారు. మంగళవారం బీచ్‌రోడ్డులోని ఒక హోటల్‌లో మంత్రిని ఏపీ చాంబర్స్ పూర్వ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్, ఎఫ్ఏపీసీసీఐ అధ్యక్షుడు కంకటాల మల్లిక్, టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు విజయ్‌మోహన్, హోటల్స్, రెస్టారెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(హెచ్ఆర్ఏఏపీ) అధ్యక్షుడు ఎం.వి.పవన్‌కార్తీక్‌లు కలిశారు. పరిశ్రమలకు అందించే విధానంలో విద్యుత్ చార్జీలు, ప్రాపర్టీ ట్యాక్స్, నీటి సరఫరా చార్జీలు అమలు చేయాలని కోరారు. ఇప్పటికే హోటల్ రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చారని, అదే విధంగా సీఎంతో చర్చించి తగిన రాయితీలు కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

యోగా దినోత్సవానికి 25 మంది స్నేక్ క్యాచర్స్



కంబాలకొండ పార్కులో స్నేక్ క్యాచర్స్‌తో రేంజర్ శాస్త్రి

ఆరిలోవ: ఈనెల 21న నిర్వహించనున్న యోగా దినోత్సవానికి 25 మంది స్నేక్ క్యాచర్స్‌ను అటవీశాఖ అధికారులు సిద్ధం చేశారు. వారితో మంగళవారం కంబాలకొండ ఎకో టూరిజం పార్కు క్యాంటీన్‌లో ఫారెస్ట్ రేంజర్ శాస్త్రి సమావేశమయ్యారు. వారి విధులు, ఏయే పాయింట్ల వద్ద ఎవరెవరు ఉండాలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా దినోత్సవ ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అటవీ శాఖ తరఫున పాములు భయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు బీచ్ రోడ్డులో 28 కిలోమీటర్ల పొడవున ఇరుపక్కలా 85 ప్రాంతాలలో యోగాసనాలు వేస్తారని, ఆ ప్రాంతాలకు సమీపంలో 12 చోట్ల స్నేక్ క్యాచర్స్ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. వారితో పాటు మరో రెండు మొబైల్ బ్యాచ్‌లు(స్నేక్ క్యాచర్స్) కూడా బైక్‌లపై తిరుగుతాయన్నారు. వారికి ప్రత్యేకంగా ఐడీ కార్డులు అందిస్తామన్నారు. సమావేశంలో సెక్షన్ ఆఫీసరు శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కు ఆస్పత్రిలో వైద్యుల కొరత!

- రేడియాలజీ, అనస్థిషియా వైద్యులు నిల్
- రేపటి నుంచి నిలిచిపోనున్న కంటి వైద్య సేవలు



ఉక్కు జనరల్ ఆస్పత్రి

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రి పరిస్థితి రోజు రోజుకూ తీసికట్టుగా మారుతోంది. ఒకవైపు పర్మనెంట్ వైద్యుల కొరత తీవ్రంగా వేధిస్తుండగా... మరోవైపు కన్సల్టెంట్ స్పెషలిస్టులను కూడా అందుబాటులో ఉంచలేడం లేదు. ప్రస్తుతం కొన్ని విభాగాల్లో ఒకరిద్దరు పర్మినెంట్ వైద్యులు ఉండడంతో అరకొరగా నడుస్తోంది. కంటి విభాగం సేవలు గురువారం నుంచి పూర్తిగా నిలిచి పోయే పరిస్థితి ఏర్పడింది. ఆస్పత్రిలో ఇప్పటి వరకు జనరల్ సర్జన్లు ఇద్దరు పర్మెనెంట్ వైద్యులు ఉండగా ఒకరు ఈనెలాఖరున పదవీ విరమణ చేస్తున్నారు. జనరల్ మెడిసిన్‌లో ఒక పర్మనెంట్ స్పెషలిస్టు ఉండగా మరొక కన్సల్టెంట్ స్పెషలిస్టు ఉండేవారు. డెర్మటాలజీ విభాగంలో ఒక పర్మనెంట్ వైద్యుడు, ఒక కన్సల్టెంట్ వైద్యుడు ఉండేవారు. అనస్థీషియా, రేడియాలజీ, కంటి విభాగాల్లో రెగ్యులర్ వైద్యులు లేరు. దీంతో ఇప్పటి వరకు కన్సల్టెంట్లతోనే నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కన్సల్టెంట్ల కాల పరిమితి పూర్తి కావడంతో రేడియాలజీ, అనస్థీసియా, కంటి విభాగాల సవేలు పూర్తిగా నిలిచిపోనున్నాయి. సర్వేంద్రియాం నయనం ప్రధానం అనే నానుడి మేరకు కంటి విభాగం అత్యంత కీలకం అని అందరికీ తెలిసిందే. ఇప్పటి వరకు కంటి స్పెషలిస్టు సేవలు అందించిన డాక్టర్ రాధాలక్ష్మి, డాక్టర్ ఆనందరావుల సేవలు ఈనెల 4తో నిలిచి పోయాయి. ఆఖరి స్పెషలిస్టు డాక్టర్ సుప్రజ సేవలు బుధవారంతో నిలిచిపోనున్నాయి. దీంతో గురువారం నుంచి నేత్ర రోగులకు ఇబ్బందులు తప్పవు.

అప్రమత్తత ఏది?

ప్లాంట్‌లో జరిగే ప్రమాదంలో, ఇంట్లో గాయపడిన ఉద్యోగులు, వారి కుటుంబీకులకు ఏదైనా నేత్రపరమైన సమస్యలు వస్తే వారి పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా ఆస్పత్రి కన్సలెంట్ల నియామకానికి సంబంధించి ఈనెల 7న నోటిఫికేషన్ జారీ చేయగా 17న ఆఖరి తేదీగా నిర్ణయించారు. వారికి ఈనెల 20న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. జూలై 1 నుంచి వారి సేవలు ప్రారంభించే అవకాశం ఉంది. నేత్ర విభాగం వంటి అత్యవసర సేవలు అంశంపై యాజమాన్యం ముందుగానే తగిన చర్యలు తీసుకుని ఉంటే సేవలకు అంతరాయం కలిగి ఉండేది కాదని ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. పర్మనెంట్ వైద్యుల నియామకంతో పాటు అత్యవసరంగా కన్సల్టెంట్ స్పెషలిస్టుల నియామకాన్ని కూడా పూర్తి చేసి వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ అదనపు ప్రధానకార్యదర్శి ఎస్. రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు.

కళాశాలకు ఫస్ట్ ఎయిడ్ బాక్స్ బహూకరణ

డాబాగార్డెన్స్: హిమా హ్యూమానిటేరియన్ అసోసియేషన్, ఒడిశా స్టీవ్‌డోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని ఎలియన్స్ కళాశాలకు బీపీ ఆపరేటర్, స్టెతస్కోప్‌తో పాటు ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా హిమా హ్యూమానిటేరియన అసోసియేషన్ చైర్మన్ బీఎన్ మూర్తి, వ్యవస్థాపక కార్యదర్శి టీవీడీ దాస్ మాట్లాడుతూ యువత జంక్ ఫుడ్స్ ఆరగించి రోగాల బారిన పడతున్నారని, ప్రమాదాలు జరిగినప్పుడు యువతకు అత్యవసర చికిత్స అందించేందుకు ఫస్ట్ ఎయిడ్ చికిత్స బాక్స్ సామాజిక సేవా దృక్పథంతో అందజేసినట్టు చెప్పారు. త్వరలోనే విద్యార్థులకు ఉచిత రక్త పరీక్షలు, ఈసీజీ వంటి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కళాశాల చైర్మన్ కొల్లా సతీష్‌కుమార్ మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా చిన్న వయసు నుంచే ఆరోగ్యం పట్ల విద్యార్థులు శ్రద్ధ తీసుకుని, ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేజీహెచ్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ బంగు శ్రీనివాస్, హిమా అధ్యక్షుడు పులమరశెట్టి సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షులు బీఏఎన్ నంద, ప్రభాత్, హరి, ఆర్.కిరీటి కుమార్, మజ్జి వెంకట్రావు, ఎలియన్స్ కళాశాల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు సత్కారం



కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణిని సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

మహారాణిపేట: కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఇసుకపల్లి వాణిని బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రుపాకుల రవికుమార్, సీజీహెచ్ఎస్ లబ్ధిదారుల సంక్షేమ సంఘం కార్యదర్శి ఏఎస్ రామం, అబిద్ హుస్సేన్, నగర బీజేపీ మెడికల్ సెల్ కన్వీనర్ వెంకటేశ్వరరావు, కో కన్వీనర్ బి. భాగ్యలక్ష్మి, నగర బీజేపీ ఉపాధ్యక్షుడు చొక్కాకుల రాంబాబు, పార్టీ నాయకులు చాట్ల బాబూరావు రెడ్డి, సుశీల, సంపత్ కుమార్ తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేజీహెచ్ అభివృద్ధికి కృషి చేస్తున్నాయని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ కేజీహెచ్ అభివృద్ధికి ఆకుంఠిత దీక్షతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగులంతా సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

ఏయూ మోడల్ కెరీర్ సెంటర్‌లో నేడు ఇంటర్వ్యూలు

మద్దిలపాలెం: ఏయూలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో బుధవారం ఉదయం 10:30 గంటల నుంచి పలు సంస్థల్లోని ఉద్యోగ ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మోడల్ కెరీర్ సెంటర్ డిప్యూటీ చీఫ్ కె. దొరబాబు తెలిపారు. స్మార్ట్‌మీటర్ల ఇన్‌స్టలేషన్ రంగంలో 80 ఖాళీలు ఉన్నాయి. ఎలక్ట్రికల్ ఐటీఐ లేదా గ్రాడ్యుయేషన్ తోపాటు 2 ఏళ్ల అనుభవం ఉన్నవారు, 32 ఏళ్లలోపు వయసు గలవారు అర్హులు. ఎంపికైన వారికి నెలకు రూ.20,000 వేతనం లభిస్తుంది. ఐఫోన్ మ్యానుఫ్యాక్చరింగ్ విభాగంలో 60 ఖాళీలు ఉన్నాయి. ఇంటర్మీడియట్ అర్హతతోపాటు 26 ఏళ్లలోపు వయసు గలవారు అర్హులు. నెలకు రూ.18,700 వేతనం అందిస్తారు. డి.మార్ట్‌లో 30 ఖాళీలకు ఇంటర్మీడియట్ అర్హతతోపాటు 25 ఏళ్లలోపు వయసు గలవారు అర్హులు. వీరికి నెలకు రూ. 11,500 వేతనం ఉంటుంది.ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలో 50 ఖాళీలు అందుబాటులో ఉన్నాయి. 10వ తరగతి అర్హతతోపాటు 50 ఏళ్లలోపు వయసు గలవారు అర్హులు. నెలకు రూ. 16,000 వేతనం ఇవ్వనున్నారు.

నేడు మంచినీటి సరఫరా విభాగం కార్మికుల టూల్ డౌన్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ వాటర్ సరఫరా విభాగం ఔట్‌సోర్సింగ్ కార్మికులు బుధవారం టూల్ డౌన్ (పని బంద్) చేసి నిరసన తెలపనున్నారని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు మహదేవ్ ఆనందరావు, ప్రధాన కార్యదర్శి రెల్లి సత్యం సంయుక్త ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ మంచి నీటి సరఫరా విభాగంలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు కార్పొరేషన్ తీర్మానం మేరకు (2024 డిసెంబర్ 11, జీవో 7) వేతనాలు అమలు చేసేందుకు గత ఐదు నెలలుగా ఆప్కాస్ అధికారులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి ఈ ఏడాది మే నెల డ్యూటీ సర్టిఫికెట్లు సంబంధిత అధికారులకు ఇచ్చారని, ఆప్కాస్ వెబ్‌సైట్‌లో కొత్త వేతనాలు అప్‌లోడ్ చేసినట్లు తెలిపారు. గత నెల 24న ఆప్కాస్ పోర్టల్‌లో మొదటి థంబ్ వేసే ప్రక్రియ పూర్తయి, ఇన్వాయిస్ కూడా జెనరేట్ అయిందని, దానిని చూసి వాటర్ సరఫరా ఔట్ సోర్సింగ్ కార్మికులు సంతోషపడ్డారని తెలిపారు. ఇదిలా ఉండగా.. జనరేట్ అయిన మరుసటి రోజు నుంచి అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయని, ఎవరో.. ఏదో చెప్పారని.. తిరిగి పాత వేతనాల బిల్లునే పెడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిన కార్మికులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. జీవో 7 ప్రకారం వేతనాలు అమలు చేయాలని కోరారు. లేనిచో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పని బంద్ చేసి నిరసన తెలపనున్నట్టు చెప్పారు. అధికారులు స్పందించకపోతే నిరవధిక సమ్మె చేయనున్నట్లు తెలిపారు.